


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 313 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 15 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :313 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 15 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



సబ్ రిజిస్టర్

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..?

## ప్రభుత్వ కార్యాలయమా.. ప్రైవేట్ ఆఫీసా..?




ప్రత్యేక కథనం – ఎపిసోడ్ -1

**తన ప్రైవేట్ సిబ్బందికి ఏసీ రూములో్ల చైర్**




**కింది స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు మీట పై కూర్చోవాల్సిందే**



**ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ సిబ్బందితో పనులు**



**వినియోగదారులకు రిజిస్ట్రార్ కోసం తప్పని తిప్పలు**



**‘ఏసీఆర్ రిజిస్ట్రేషన్’** దరఖాస్తులపై కారణం లేని తిరస్కరణల ఆరోపణలు

**అదనపు వసూళ్ల ఆరోపణలు..** ప్రతి డాక్యుమెంట్‌పై 1 నుంచి 2 శాతం డిమాండ్ చేస్తున్నారని విమర్శలు

**ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం**

**సబ్ రిజిస్ట్రార్ వ్యవహారశైలిపై విచారణకు ప్రజల డిమాండ్**

## ప్రజాధనం – ప్రైవేట్ పెత్తనం? ఇలాగేనా ప్రభుత్వ సేవ ?

- మిగతా 2లో

# అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి

- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు
- అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన
- ఇకపై నెలవారీ ఆర్థిక నివేదికల (వీజు=) ఆధారంగా సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ

- మిగతా 2లో



# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది



## మత్స్యకార మృతుల కుటుంబాలను పరామర్శించిన జగన్

- మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ విమర్శ
- ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదని ఆగ్రహం
- తీరానికి 10 మైళ్ల దూరంలోనే ప్రమాదం జరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపణ
- ఇప్పటికైనా బాధితులకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్

- మిగతా 2లో










> “ప్రభుత్వానికి మానవత్వం లేదు. ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదు. మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటాం.
>
> – వైఎస్ జగన్, వైసీపీ అధినేత

## కాపు ఉద్యమ సారధి ఇకలేరు

వయస్సు 73 సంవత్సరాలు



# సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

- కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు
- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచిన నేత
- కాపు ఉద్యమ నేతగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర

- మిగతా 2లో

# జగన్ హయాంలో 275 మంది మత్స్యకారులు మృతి చెందారు

- వైసీపీ పాలనలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలను జగన్ ఎందుకు పరామర్శించలేదన్న అచ్చెన్నాయుడు
- గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిందని ఎద్దేవా
- మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రష్యాకు చెక్

రష్యా నుంచి పెరుగుతున్న బాలిస్టిక్ క్షిపణుల ముప్పును ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్‌తో పాటు మరో తొమ్మిది యూరప్ దేశాలు కొత్త కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించాయి. గత నాలుగేళ్లకు పైగా రష్యా పూర్తి స్థాయి దాడిని తట్టుకుని పోరాడిన ఉక్రెయిన్ అనుభవాన్ని వినియోగించుకుని యూరప్‌కు ఉమ్మడి బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించాయి. పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో జరిగిన సమావేశంలో డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, నార్వే, స్పెయిన్, స్వీడన్, బ్రిటన్ నాయకులు ఈ ప్రకటన చేశారు. "యూరప్‌కు ఉమ్మడి బాలిస్టిక్ క్షిపణి రక్షణ సామర్థ్యాన్ని నిర్మించడమే మా లక్ష్యం" అని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే క్షిపణి ముప్పును అడ్డుకోవాలంటే సమగ్ర, సమన్వయంతో కూడిన క్షిపణి రక్షణ వ్యవస్థ అవసరమని వారు అభిప్రాయపడ్డారు. రష్యా దాడులను ఎదుర్కొంటూ ఉక్రెయిన్ సంపాదించిన అనుభవం ఈ ప్రణాళికకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ రక్షణ వ్యవస్థ ఎప్పటిలోగా సిద్ధమవుతుందన్న దానిపై గడువు ప్రకటించలేదు. ఇతర దేశాలు కూడా ఈ కూటమిలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

**ఏడాదిలో కొత్త వ్యవస్థ లక్ష్యం...**

తమ భాగస్వామ్య దేశాలతో కలిసి వచ్చే 12 నెలల్లో తక్కువ ఖర్చుతో భారీ స్థాయిలో తయారు చేయగల క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేసే అవకాశం ఉందని జెలెన్‌స్కీ చెప్పారు. దీని వల్ల యూరప్ తన అవసరాలకు తానే క్షిపణి నిరోధక వ్యవస్థలను తయారు చేసుకోవడంతో పాటు అవసరమైన ఇతర దేశాలకు కూడా అందించగలదని వివరించారు. శీతాకాలం ప్రారంభమయ్యేలోపు వైమానిక రక్షణను మరింత బలోపేతం చేయాలని ఉక్రెయిన్ ప్రయత్నిస్తోంది. ప్రతి శీతాకాలంలో రష్యా విద్యుత్, తాగునీరు, తాపన వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని దాడులు పెంచుతుందని జెలెన్‌స్కీ చెప్పారు. పారిస్ సమావేశంలో ఉక్రెయిన్ ప్రతినిధులు ప్రతిపాదిత యాంటీ–బాలిస్టిక్ కార్యక్రమాన్ని ప్రభుత్వాధినేతలు, జాతీయ భద్రత సలహాదారులు, రక్షణ సంస్థల ప్రతినిధులకు వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం ఉక్రెయిన్‌కు పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలను దేశంలోనే తయారు చేసుకునే లైసెన్స్ ఇస్తామని ప్రకటించారు. ఇది ఉక్రెయిన్‌కు కీలక ముందడుగుగా భావిస్తున్నప్పటికీ, ఆ ప్రణాళిక అమల్లోకి రావడానికి ఇంకా ఏళ్ల సమయం పట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. యూరప్ ప్రతిపాదిస్తున్న కొత్త వ్యవస్థ ఎంత త్వరగా సిద్ధమవుతుందో ఇంకా స్పష్టత లేదు.

**వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న పుతిన్...**

ఇటీవల ఉక్రెయిన్ రష్యాలోని చమురు శుద్ధి కేంద్రాలు, ట్యాంకర్లు, ఇంధన టెర్మినళ్లపై దీర్ఘశ్రేణి దాడులు చేసింది. వీటి వల్ల పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఏర్పడింది. దీనిపై స్పందించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గట్టి ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. "రష్యా భూభాగాన్ని ఎక్కడ లక్ష్యంగా చేసుకున్నా అదే స్థాయిలో ప్రతిస్పందిస్తాం. అయితే మా దాడులు మరింత శక్తివంతంగా ఉంటాయి" అని క్రెమ్లిన్ అనుకూల కార్యకర్తల సమావేశంలో చెప్పారు. ఇదే సమయంలో బ్రస్సెల్స్‌లో సమావేశమైన యూరప్ విదేశాంగ మంత్రులు ఉక్రెయిన్ అవసరాలు, యూరప్‌కు రష్యా నుంచి ఎదురవుతున్న ముప్పుపై చర్చించారు.

**చర్చలకు రష్యాను ఒప్పించాలని ...**

ఉక్రెయిన్ తాజా విజయాలను ఆసరాగా తీసుకుని యుద్ధానికి ముగింపు పలికే చర్చల బల్లపై పుతిన్‌ను తీసుకురావాలని ఉక్రెయిన్, దాని యూరప్ భాగస్వాములు భావిస్తున్నారు. అయితే అమెరికా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నా రాజీకి సిద్ధమన్న సంకేతాలు మాస్కో నుంచి కనిపించడం లేదు. పారిస్ సమావేశాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తక్కువ చేసి మాట్లాడారు. "ఇది యుద్ధాన్ని ప్రోత్సహించే దేశాల కూటమి. రష్యాకు వ్యూహాత్మక పరాజయం కలిగించవచ్చన్న భ్రమలో ఉన్నవారి సమూహం" అని వ్యాఖ్యానించారు.

**డ్రోన్ దాడులతో రష్యాపై ఒత్తిడి...**

డ్రోన్ సాంకేతికతలో సాధించిన పురోగతితో ఉక్రెయిన్ ఇటీవల పైచేయి సాధించిందని పశ్చిమ దేశాల అధికారులు, విశ్లేషకులు చెబుతున్నారు. ముందుబాటుకు వెనుకనున్న సరఫరా మార్గాలపై దాడులు చేయడంతో రష్యా సైన్యానికి ఇబ్బందులు పెరిగి, ముందుకు సాగడం నెమ్మదించిందని వారు విశ్లేషిస్తున్నారు. జూలై 6 నుంచి 13 మధ్య అజోవ్ సముద్రంలో క్రిమియా సమీపంలో రష్యాకు చెందిన 105 నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఉక్రెయిన్ మానవరహిత వ్యవస్థల దళాల కమాండర్ రాబర్ట్ బ్రోవ్డీ తెలిపారు. వీటిలో ట్యాంకర్లు, సరకు నౌకలు, ఫెర్రీ, టగ్‌బోట్లు ఉన్నాయని చెప్పారు. ఈ వివరాలను స్వతంత్రంగా నిర్ధారించడం సాధ్యం కాలేదు. రష్యా కూడా వెంటనే స్పందించలేదు.

**మోల్డోవాలో పడిన డ్రోన్...**

ఒడెసా ప్రాంతంపై రష్యా రాత్రిపూట జరిపిన దాడుల సమయంలో ప్రయోగించిన ఒక డ్రోన్ మోల్డోవా భూభాగంలో కూలి పేలిందని ఆ దేశ విదేశాంగ శాఖ తెలిపింది. దీనిని తీవ్రంగా ఖండించింది. మరోవైపు రష్యా వైపు దూసుకొచ్చిన 350 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. వాటిలో 50 డ్రోన్లు రాజధాని సమీపంలోనే కూల్చివేశామని చెప్పారు. మాస్కో ప్రాంత గవర్నర్ ఆంద్రే వోరోబ్యోవ్ ప్రకారం, రాత్రి జరిగిన దాడిలో 81 డ్రోన్లను అడ్డుకున్నారు. పియోనెర్స్కీ ప్రాంతంలో ముగ్గురు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అదే సమయంలో రష్యా ఉక్రెయిన్‌పై 134 దీర్ఘశ్రేణి డ్రోన్లు, మూడు మార్గనిర్దేశిత క్షిపణులు ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఒడెసా పోర్టు మౌలిక సదుపాయాలపై జరిగిన దాడిలో టోగో జెండాతో ఎరువులు తీసుకెళ్తున్న ఓ వాణిజ్య నౌకకు మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో ఐదుగురు సిబ్బంది మరణించగా, మరో పది మంది గాయపడ్డారని ప్రాంతీయ సైనిక పరిపాలన అధికారి ఒలెహ్ కిపర్ వెల్లడించారు.

# పీఓకేలో పాక్ దళాల కాల్పులు.. ఆరుగురు పౌరులు మృతి

- మొదటి పేజి తరువాయి

తెగబడ్డాయి. నిరసనకారులను చెదరగొట్టే నెపంతో పాక్ సైనిక, పారామిలిటరీ దళాలు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పాక్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా స్థానికుల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన అసంతృప్తి ఈ తాజా రక్తపాతంతో మరింత తీవ్రరూపం దాల్చింది.

**వైట్ హౌస్ చేరిన పీఓకే నిరసన గళం:**

తాజాగా జరిగిన ఈ దారుణానికి సరిగ్గా ఒక రోజు ముందే అమెరికాలోని వాషింగ్టన్‌లో నివసిస్తున్న పీఓకే కమ్యూనిటీ ప్రతినిధులు వైట్ హౌస్ వెలుపల భారీ ప్రదర్శన చేపట్టారు. మహిళలు, పిల్లలతో సహా సుమారు 100 మందికి పైగా ఈ నిరసనలో పాల్గొని తీవ్ర మానవీయ సంక్షోభాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లారు. పీఓకే పౌర నివాస ప్రాంతాల నుండి పాక్ సైన్యాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు 40 లక్షల మంది ప్రజలను బాహ్య ప్రపంచానికి దూరం చేస్తూ పాక్ ప్రభుత్వం విధించిన ఇంటర్నెట్ బంధనాన్ని (బ్లాకౌట్) ఎండగట్టారు. తమ ప్రాణాలను కాపాడటానికి, మానవీయ సహాయం అందించడానికి భారత్ తక్షణమే జోక్యం చేసుకోవాలని నిరసనకారులు అసాధారణ విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో పూంచ్, దోడా సెక్టార్ల ద్వారా నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) ను తెరవాలని కూడా కోరారు.

**ఇది వ్యవస్థీకృత దోపిడే.. పాకిస్తాన్‌పై భారత్ ఆగ్రహం:**

పాకిస్తాన్ అక్రమంగా, బలవంతంగా ఆక్రమించుకున్న ప్రాంతాల్లో దశాబ్దాలుగా సాగిస్తున్న వ్యవస్థీకృత దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనాపరమైన అణచివేతకు పీఓకే లో జరుగుతున్న నిరసనలే ప్రత్యక్ష నిదర్శనం అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల సరఫరాను నిలిపివేయడం, పోలీసుల క్రూరత్వం, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్‌లను అమలు చేయడం వంటి చర్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను భారత్ తీవ్రంగా విమర్శించింది. నిరాయుధ పౌరులపై ప్రాణాంతక బలప్రయోగం చేసిన ఫలితంగా విషాదకరమైన ప్రాణనష్టం జరిగిందని ఆయన అన్నారు. పౌరులపై సాగిస్తున్న అణచివేతకు అంతర్జాతీయ సమాజం పాక్?ను జవాబుదారీగా చేయాలని భారత్ పేర్కొంది.

# ఫిఫా వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్ లు.. కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం

ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఫుట్‌బాల్ క్రీడ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. అభిమానుల అభ్యర్థన మేరకు బెంగళూరులో ఆహార సేవల సమయాన్ని అర్ధరాత్రి 1 గంట నుంచి 3:30 గంటల వరకు పొడిగిస్తున్నాం. ప్రజా భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు.

# సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు.

రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి.

2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు.

గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..?

- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ పెత్తనం..?
- ప్రజలకు తప్పని ఇబ్బందులు, లంచాల ఆరోపణలు
- ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రైవేట్ కార్యాలయంగా మార్చారా..?
- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం
- ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ సిబ్బందితో పనులు
- వినియోగదారులకు రిజిస్ట్రేషన్ కోసం తప్పని తిప్పలు
- 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' దరఖాస్తులపై కారణం లేని తిరస్కరణల ఆరోపణలు
- అదనపు వసూళ్ల ఆరోపణలు.. ప్రతి డాక్యుమెంట్‌పై శాతం డిమాండ్ చేశారనే విమర్శలు
- సబ్ రిజిస్ట్రార్ వ్యవహారశైలిపై విచారణకు ప్రజల డిమాండ్

**భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ వ్యవస్థకు బదులుగా ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం నడుస్తోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ వ్యక్తులతో ప్రభుత్వ పనులు చేయించడం, రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాక, 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' దరఖాస్తులను సరైన కారణం లేకుండానే తిరస్కరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.**

ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు, జూలై 14:

పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ, కీలక పనులను ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ వాతావరణంలో పనిచేస్తుండగా, ప్రైవేట్ వ్యక్తులు ప్రత్యేక గదుల్లో కూర్చొని ప్రభుత్వానికి సంబంధించిన ఫైళ్లు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' విధానంలో కూడా సరైన కారణం లేకుండానే దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు అనవసరంగా పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు, ప్రతి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌పై అదనంగా శాతం చొప్పున డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ సేవల పారదర్శకతపై తీవ్ర ప్రభావం చూపే అంశమని ప్రజలు పేర్కొంటున్నారు.

కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ వ్యక్తులతో ప్రభుత్వ పనులు చేయించడం చట్టబద్ధమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పాత్రపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, ప్రశ్నించిన వారిపై అనుచితంగా స్పందిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అధికారి ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో నిజానిజాలను నిర్ధారించి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది

మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు.

ప్రభుత్వం

తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# జగన్ హయాంలో 275 మంది మత్స్యకారులు మృతి చెందారు

మత్స్యకారులను పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని అన్నారు. వైసీపీ పాలనలో ప్రకృతి వైపరీత్యాల వల్ల 275 మంది మృతి చెందారని తెలిపారు. అయితే, వారిని జగనే చంపేశారని అవివేకంగా తాము మాట్లాడబోమన్నారు. నాడు మృతి చెందిన 275 మంది కుటుంబాలను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. గొడ్డలి పార్టీ అబద్ధాల పునాదులపై పుట్టిందని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. సీదిరి అప్పలరాజు కుమారుడు ఓ వ్యక్తిని తన వాహనంతో ఢీకొట్టి చంపినా వైద్యం చేయించకపోవడం దారుణమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుందని, ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి మత్స్యకారుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. జగన్ చేసే చౌకబారు వ్యాఖ్యలను ప్రజలు నమ్మరని అన్నారు.

# అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి

"సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

**డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష**

డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్ - వీజు=) ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. "ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం," అని తెలిపారు.

గత ఐదేళ్ల (2019-24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం" అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

**అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (గ్రా+=గా)లో 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

**ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై స్పష్టత**

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

# పనికిరాని నిబంధనలు రద్దు చేయండి! ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం

ప్రభుత్వ పాలనలో వేగం పెంచేందుకు, అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని నివారించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరుతో అభివృద్ధి ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన ఆయన, అవసరం లేని, పాతబడిపోయిన 'బిజినెస్ రూల్స్'ను సంస్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేసి, నిబంధనలను సరళతరం చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీఎస్) కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ఉన్నతాధికారులు సరైన నాయకత్వంతో పనిచేస్తేనే ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వ్యక్తి వరకు చేరతాయని స్పష్టం చేశారు. టెక్నాలజీని అనుసంధానం చేస్తూ పాలనలో పారదర్శకత తీసుకురావాలని సూచించారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+ూణూ) 20 శాతం వృద్ధి సాధించిందని, ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు కల్పించాలన్నారు.


**దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా మార్చాలి**

దేవాదాయ శాఖపై సమీక్షలో భాగంగా రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ ఆలయాల పరిసరాల్లో ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలు పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. ఎఅదేవిధంగా, ఆర్టీసీ బస్సులు సరైన సమయానికి నడిచేలా చూడాలని, బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను పెంచాలని, రాష్ట్రంలో యూరియా కొరత రాకుండా రైతులకు భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

**ఫిర్యాదుల పరిష్కారానికి క్రౌడ్ సోర్సింగ్**

ప్రభుత్వానికి వచ్చే అన్ని ఫిర్యాదుల స్వీకరణకు 'క్రౌడ్ సోర్సింగ్' విధానాన్ని అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అర్జీని మానవీయ కోణంలో పరిశీలించి, వేగంగా పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షతో కొందరి భూములను 22ఏ జాబితాలో చేర్చారని, ఇలాంటి వివాదాలను పరిష్కరించడం ద్వారా ఎన్నో అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు.

# అరకు వ్యాలీ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 16న ప్రవేశ పరీక్ష



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్తవీధి,జులై 14:** ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరకు వ్యాలీ బాలుర క్రీడా పాఠశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ తెలిపారు. ప్రాజెక్టు అధికారి విడుదల చేసిన ప్రకటన ప్రకారం, 5వ తరగతిలో 30, 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 4, 9వ తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు.2026--27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో సంబంధిత తరగతులు చదువుతున్న గిరిజన బాలురు మాత్రమే ఈ ప్రవేశ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు జులై 16న ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికేట్, పాస్‌పోర్టు సైజు ఫోటోతో అరకు వ్యాలీ క్రీడా పాఠశాలలో హాజరుకావాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అరకు వ్యాలీ క్రీడా పాఠశాలలో ప్రవేశం కల్పించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ తెలిపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# విశాఖ జంతు ప్రదర్శనశాల అభివృద్ధికి నిధుల సమీకరణ



- రాష్ట్రంలో వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ
- అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 14:**రాష్ట్రంలో వన్యప్రాణులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అవసరమైతే చట్టాల్లో సంస్కరణలు చేపట్టేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత పరిస్థితుల్లో వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖలో పర్యటించిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, రెవెన్యూ, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ “ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన శాసనసభ కమిటీ. కమిటీ సూచనలతో పాటు అధికారులు, నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో వన్యప్రాణులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు బలోపేతమైన విధానాన్ని రూపొందిస్తాం” అని తెలిపారు. సమగ్ర కార్యాచరణతో పాటు అవసరమైతే చట్టాల్లో మార్పులు, సంస్కరణలు చేపట్టాలని, మేధోపరమైన చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం, ఇందిరాగాంధీ జాతీయ జంతు ప్రదర్శనశాల, ఎనిమల్ రెస్క్యూ సెంటర్లను ప్రత్యక్షంగా సందర్శించి అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమావేశంలో గుర్తు చేశారు. జంతు సంరక్షణ, మౌలిక వసతులు, సిబ్బంది అవసరాలు, సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలపై సమగ్రంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. 23 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాను అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కంబాలకొండను వైల్డ్‌లైఫ్ శాంక్చువరీగా ప్రకటించడం వల్ల ఆక్రమణలను అరికట్టగలిగామని గుర్తు చేశారు.

**ఏడాదికి రూ.10 కోట్లు అవసరం.. ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.3 కోట్లు తెచ్చే బాధ్యత తీసుకుంటాను**

విశాఖ జూను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంవత్సరానికి కనీసం రూ.10 కోట్ల నిధులు అవసరమని స్పీకర్ తెలిపారు. ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని పెంచేందుకు స్థానిక అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని, వినోద కార్యక్రమాలు, ఆదాయార్జనకు దోహదపడే కొత్త కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్ర ఎంపీల ల్యాడ్స్ ద్వారా ఏటా రూ.3 కోట్ల నిధులు సమీకరించే బాధ్యతను తానే తీసుకుంటానని ప్రకటించారు. రోజుకు నాలుగు నుంచి ఐదు వేల మంది సందర్శకులు జూను సందర్శిస్తున్నప్పటికీ కేవలం పది మరుగుదొడ్లు మాత్రమే ఉండటం సరిపోదన్నారు. సందర్శకుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు పెంచాలని, అత్యాధునిక క్యాంటీన్, విశ్రాంతి కేంద్రాలు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. జూలో 81 శాంక్షన్ పోస్టులు ఉండగా 59 పోస్టులు ఖాళీగా ఉండటం, మిగతా వారిని ఔట్ సోర్సింగ్ విధానంలో కొనసాగించటం ఆందోళనకరమని స్పీకర్ అన్నారు. 1,404 జంతువుల సంరక్షణకు కేవలం ఒక పశువైద్యుడు, ఒక సహాయకుడు మాత్రమే ఉండటం సరైన పరిస్థితి కాదన్నారు. దీనిపై కమిటీ తరఫున తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు.

జిల్లాలోని పరిశ్రమలు తమ సీఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధికి వినియోగించాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జూ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు సమీకరించాలని సూచించారు. బ్యాంకులు కూడా సామాజిక బాధ్యతతో సహకరించాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం వంటి సంస్థల నుంచి కూడా జంతు సంరక్షణకు నిధులు సమీకరించే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు.

కమిటీ సభ్యుడు నరేంద్ర వర్మ మాట్లాడుతూ విశాఖ, తిరుపతి జూ పార్కులను దేశంలోనే ఆదర్శ జూలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. నిపుణులైన పశువైద్యులను నియమించడం, సీఎస్ఆర్ ద్వారా ప్రతి ఏడాది రూ.10 కోట్ల వరకు నిధులు సమీకరించడం, 2047 విజన్‌కు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గొండు శంకరరావు మాట్లాడుతూ కంబాలకొండ అభయారణ్యాన్ని జూ పార్కుతో అనుసంధానించేలా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విశాఖకు వచ్చే ప్రతి పర్యాటకుడు తప్పనిసరిగా జూ పార్కును సందర్శించేలా పర్యాటక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని, వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో సింగపూర్ మాండై జూ నమూనాపై అధ్యయనం కొనసాగుతోందని, ఆగస్టు చివరి వారంలో నివేదిక సిద్ధమవుతుందని తెలిపారు. పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు.

**సీఎస్ఆర్ ద్వారా రూ.3 కోట్లు సమీకరిస్తాం: జిల్లా కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ విశాఖ జూ పార్కు, కంబాలకొండ, బే సిటీ అభివృద్ధి కార్యక్రమాలు విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. జిల్లా తరఫున సీఎస్ఆర్ ద్వారా రూ.3 కోట్ల నిధులు సమీకరించి జూ అభివృద్ధికి వినియోగిస్తామని వెల్లడించారు. ప్రైవేట్ ఈక్విటీ, ఏజెన్సీ మోడల్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఖాళీల భర్తీ అంశాన్ని జాబ్ క్యాలెండర్‌లో చేర్చేందుకు కమిటీ సిఫారసు అవసరమని పేర్కొన్నారు. చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కాశీ విశ్వనాథ రాజు మాట్లాడుతూ వీఎంఆర్డీఏ పరిధిలో చేపడుతున్న రోడ్లకు అనుమతులు రావడం శుభపరిణామమన్నారు. జూ అభివృద్ధికి ఐలాండ్ మోడల్, పీపీపీ మోడల్ వంటి వినూత్న విధానాలను పరిశీలిస్తామని తెలిపారు.

ఏకలెక్టరేట్లో అధికారులతో జరిగిన సమావేశం అనంతరం కమిటీ చైర్మన్, సభ్యులు వీసీ హాలులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వన్యప్రాణి సంరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు కమిటీ కట్టుబడి ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమావేశంలో ఏపీ అసెంబ్లీ కార్యదర్శి ప్రసన్న కుమార్ సూర్యదేవర, జిల్లా కలెక్టర్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కాశీ విశ్వనాథ రాజు, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్,జిల్లా అటవీశాఖ అధికారి రవీందర్ దామా,జూ క్యురేటర్ డాక్టర్ మంగమ్మ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు మనకోసమే

**“సర్”పై అలసత్వం వద్దు – “ఓటు”అనే వజ్రాయుధమే ముద్దు:జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 14:**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. ముందు షెడ్యూల్ ప్రకారం అయితే సెప్టంబర్ 22న తుది జాబితా ప్రచురణ జరగాల్సి ఉందని గుర్తు చేశారు.

జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సవరించిన షెడ్యూల్‌ను గమనించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# విశాఖ పడవ ప్రమాదం: కోటి పరిహారం ఇవ్వాలి - జగన్ డిమాండ్




**విశాఖ తూర్పు,పెన్ పవర్. జూలై 14:** విశాఖ తీరంలో చేపలవేటకు వెళ్లి పడవ బోల్తా పడి మృతి చెందిన 6గురు మత్స్యకారుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

జూలై 4న విశాఖకు 10 మైళ్ల దూరంలో జరిగిన ఈ ప్రమాదంలో 7 మందిలో 6గురు చనిపోగా, చిన్నా మాత్రం బతికి బయటపడ్డారు. మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించిన జగన్, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రాణనష్టం జరిగిందని ఆరోపించారు.

ప్రమాద సమాచారం అందినా అధికారులు వెంటనే స్పందించలేదని, ఒక మంత్రి కూడా పరామర్శించలేదని విమర్శించారు. సముద్రంలో మునిగిన బోటుకు కూడా పరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే, తమ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల్లోనే సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వైయస్సార్‌సీపీ తరఫున ప్రతి కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు ప్రకటించారు. పర్యటనలో బొత్స సత్యనారాయణ , మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్న

# ఈ-పంట నమోదును వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ టి.నిషాంతి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 14:** జిల్లాలో ఈ-పంట (ఈ-క్రాప్) నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, సాగులో ఉన్న ప్రతి ఎకరాను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిషాంతి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మతో కలిసి వ్యవసాయం, ఉద్యానవనం, ఏపీసీఎన్ఎఫ్, కాఫీ బోర్డు, ఐటీడీఏ తదితర శాఖల అధికారులతో ఈ-పంట నమోదు పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో సహజ వ్యవసాయం కింద సాగవుతున్న ప్రతి ఎకరాను ఈ-పంటలో నమోదు చేయాలని సూచించారు. అలాగే జిల్లాలోని కాఫీ సాగు విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో ఈ-పంటలో నమోదు చేయడం ద్వారా కాఫీ ఉత్పత్తుల ట్రేసబిలిటీతో పాటు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయవచ్చని తెలిపారు.జిల్లాలోని ప్రతి భూ కమతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగులో ఉన్న అన్ని పంటలను ఎలాంటి విస్తీర్ణం మిగలకుండా ఈ-పంటలో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ఎస్కే ఇన్‌చార్జులు, ఏపీసీఎన్ఎఫ్ ఐఆర్‌సీపీలు, కాఫీ లైజన్ వర్కర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ-పంట నమోదు ప్రక్రియను జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తుందని, సెప్టెంబర్ 15వ తేదీలోపు జిల్లాలోని అన్ని పంటల నమోదును శాతశాతం పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవనం, ఏపీసీఎన్ఎఫ్, కాఫీ బోర్డు, ఐటీడీఏతో పాటు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మంగలపాలెం పాఠశాలకు ఉపాధ్యాయురాలి నియామకం

- పెన్ పవర్ కథనానికి కదిలిన విద్యాశాఖ
- ‘ఉపాధ్యాయుడు లేని పాఠశాల... వంట మనిషే పిల్లలకు పాఠాలు’ వార్తతో స్పందన

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 14:** గూడెం కొత్తవీధి మండలంలోని మంగలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతపై పెన్ పవర్ ప్రచురించిన కథనానికి విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించారు. పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో, విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట మనిషే అక్షరాలు దిద్దిస్తున్న దయనీయ పరిస్థితిని “ఉపాధ్యాయుడు లేని పాఠశాల... వంట మనిషే పిల్లలకు పాఠాలు” అనే శీర్షికతో వెలుగులోకి తీసుకురావడంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది.వార్త సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీసి, విద్యాశాఖ ఉన్నతాధికారులను వెంటనే స్పందించేలా చేసింది. విద్యార్థుల విద్యాభవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు చేపట్టి కె. అనితకుమారి అనే మహిళా ఉపాధ్యాయురాలిని మంగలపాలెం పాఠశాలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మంగళవారం పాఠశాలలో బాధ్యతలు స్వీకరించి విద్యార్థులకు క్రమబద్ధంగా బోధన ప్రారంభించారు.పిల్లల చదువుకు అడ్డంకిగా మారిన సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి, అధికారుల దృష్టికి చేర్చిన పత్రిక యాజమాన్యానికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వార్త వెలువడిన వెంటనే స్పందించి ఉపాధ్యాయురాలిని నియమించిన విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇకపై తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.”ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తే పరిష్కారం సాధ్యమేనని మరోసారి నిరూపించిన ‘పెన్ పవర్ ఎఫెక్ట్’గా స్థానికులు అభివర్ణిస్తున్నారు.”


PEN POWER 24 NEWS
పెన్ పవర్
తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు

## ఉపాధ్యాయుడు లేని పాఠశాల.. వంటమనిషే పిల్లలకు పాఠాలు

మంగళపాలెం జీపీఎస్‌లో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)లో ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధన బాధ్యతలను తాత్కాలికంగా మధ్యాహ్న భోజన పథకం వంటమనిషి నిర్వహిస్తున్న దృశ్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో, పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వంటమనిషి వారికి అక్షరాలు, ప్రాథమిక పాఠాలు చెప్పడం కనిపిస్తోంది. గ్రామస్తులు వారి సేవాభావాన్ని అభినందిస్తున్నప్పటికీ, ఉపాధ్యాయుడి స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భర్తీ చేయలేదని పేర్కొంటున్నారు. ప్రాథమిక విద్య పిల్లల జీవితానికి పునాది అని, ఈ కీలక దశలో నాణ్యమైన బోధన అందకపోతే వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఏకైక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కొనసాగడం ఆందోళనకరమని వారు అంటున్నారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్తి స్థాయి ఉపాధ్యాయుడిని నియమించి, విద్యార్థులకు అంతరాయం లేకుండా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారుల విద్యతో రాజీ పడకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గడుతూరి సత్యనారాయణ కోరుతున్నారు.

epaper.penpower.in | 2026-07-14 | Page: 5
For more details, visit epaper.penpower.in



# లెప్రసీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం

- జీకే వీధి పీహెచ్‌సీ పరిధిలో ప్రత్యేక లెప్రసీ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం
- 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 14**: రాష్ట్రస్థాయి వైద్యాధికారి డాక్టర్ జే. ఉషారాణి ఆదేశాల మేరకు జీకే వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో మంగళవారం ప్రత్యేక లెప్రసీ (కుష్ఠు) వ్యాధి అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ జయరామ్ కృష్ణ (జేఎంఓ), డాక్టర్ సామ్యూల్ రెడ్డి (డిప్యూటీ పీఎంఓ), ఎం. శ్రీనివాసరావు (ఏపీఎంఓ), టీ. అశోక్ కుమార్ (పీపీఎంఓ) ఆధ్వర్యంలో రింతాడ-1, రింతాడ-2, దమనపల్లి, దేవరపల్లి, జీకే వీధి సచివాలయాల పరిధిలో ప్రజలకు లెప్రసీ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అనుమానితులకు అవసరమైన మందులు అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ లెప్రసీ వ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని తెలిపారు. చికిత్స పొందని రోగులతో దీర్ఘకాలంగా సన్నిహితంగా ఉండడం వల్ల ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుందని వివరించారు.లెప్రసీ వ్యాధి లక్షణాల్లో స్పర్శ తెలియని చర్మ మచ్చలు, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ తగ్గిపోవడం, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఈ వ్యాధి ప్రధానంగా చర్మం, నరాలను ప్రభావితం చేస్తుందని, ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. అలాంటి లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని, లెప్రసీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య బృందం సూచించింది.ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి వైద్యాధికారి డాక్టర్ జే. ఉషారాణి (ఎస్ఎంఓ), డాక్టర్ జయరామ్ కృష్ణ (జేఎంఓ), డాక్టర్ సామ్యూల్ రెడ్డి, ఎం. శ్రీనివాసరావు , టీ. అశోక్ కుమార్, జీకే వీధి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఋషి శ్రీ, ఎంపీహెచ్ఈఓ శివరాం, హెచ్‌వీ ఎర్రయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు నిర్మల, మధులత, లింగేశ్వరి, ఏఎన్ఎంలు మంగలక్ష్మి, పోలమ్మ, యోగిత, పద్మ, దేవి, ప్రవళిక, లక్ష్మి, మౌనిక, హెచ్ఏలు సదానందరావు, సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంట రుణాలను 14 లక్షల రూపాయలు విడుదల.

- పిసా చైర్మన్ తాంగుల మోహన్ దాస్ చేతుల మీదుగా రైతులకు అందజేత.



**హుకుంపేట పెన్ పవర్ జూలై 14:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 23 మంది రైతులకు 14 లక్షల రూపాయలు పంట రుణాలు అందించిన పిసా చైర్మన్ తాంగుల. మోహన్ దాస్ చేతులు మీదుగా అందచేశారు ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు పిసా సీఈఓ అప్పలనాయుడు పాల్గొన్నారు.మరియు లబ్ధిదారు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు మరో విడతగా మరో కొంత మంది రైతులకు రుణాలు పంపిణీ చేస్తామని డి సి సి.బి మేనేజర్ తెలియజేశారు . ఈ సందర్భంగా మోహన్ దాస్ మాట్లాడుతూ రైతులందరూ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా మంచి ఆర్థిక పురోగతిని సాధించాలని అన్నారు కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన -- ఎరువుల పంపిణీ

ప్రతి మంగళ, బుధవారాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 14:** ఖరీఫ్--2026 సీజన్‌లో రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించి, అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో గూడెం కొత్తవీధి మండలంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ వ్యవసాయ అధికారి బి. తిరుమలరావు ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి నల్లమిల్లి సురేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నల్లమిల్లి సురేష్ మాట్లాడుతూ, రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సూచనలు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జూలై 14 నుంచి ప్రతి మంగళ, బుధవారాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్త వెంకటేష్ బాబు మాట్లాడుతూ వరి, రాగి, వేరుశనగ పంటల్లో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి ప్రాధాన్యంపై రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ సాగు విధానాలు అనుసరిస్తే దిగుబడులు మెరుగుపడతాయని సూచించారు.అనంతరం కూటమి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పీసా అధ్యక్షుడు బలరాం, జనసేన నాయకుడు వీర వెంకట్, పీసా సభ్యుడు లకే రామచంద్ర, కూటమి నాయకులు ముక్కలి మహేష్, పరమేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ) మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

# అరకులో వాలంటీర్ల రాష్ట్ర స్థాయి మహాగర్జన

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్




**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 14:** వాలంటీర్ల సమస్యల పరిష్కారం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం అరకువేలిలో మంగళవారం నిర్వహించిన వాలంటీర్ల రాష్ట్ర స్థాయి మహాగర్జన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం అందజేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు. వాలంటీర్లకు బకాయి పడిన గౌరవ వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాగర్జనలో అల్లూరి జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్షుడు, జిల్లా సీఐటీయూ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని వాలంటీర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీకే వీధి మండల వాలంటీర్ల సంఘం అధ్యక్షుడు జి. కోటి, ఉపాధ్యక్షుడు డి. మురళీమోహన్, కార్యదర్శి పి. భాస్కరరావు, నాయకులు పి. జయరాం, రాంప్రసాద్ తదితరులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

# బాక్సైట్ తవ్వకాలను గిరిజనులంతా ఏకమై అడ్డుకోవాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పర్యటనను విజయవంతం చేయండి**



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 14:** గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వాలు మళ్లీ ప్రయత్నాలు చేస్తున్నాయని, గిరిజనుల హక్కులు, భూములు, అడవులను కాపాడేందుకు ప్రజలంతా ఏకమై ఉద్యమించాలని సీపీఎం గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు, మండల కార్యదర్శి అంపురంగి బొజ్జబాబు పిలుపునిచ్చారు.మంగళవారం అసంపల్లి గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి చుట్టుపక్కల పది గ్రామాల గిరిజనులతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాక్సైట్ తవ్వకాల దిశగా అడుగులు వేస్తున్నాయని, అందులో భాగంగానే గత నెలలో ఈ ప్రాంతంలో నమూనా శాంపిల్ సర్వే నిర్వహించారని తెలిపారు.గిరిజనుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా సర్వే జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. మన్యం ప్రాంత హక్కులు, సహజ వనరుల పరిరక్షణ కోసం గిరిజనులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 18వ తేదీన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మన్యం ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో, బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల గిరిజనులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పర్యటనను విజయవంతం చేయాలని బొజ్జబాబు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బాక్సైట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కోరాబు బొడ్డయ్య పడాల్, ముర్ల చంటిబాబు, రవి, పరమేశ్వరరావుతో పాటు వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి --ఎస్ఎఫ్ఐ



**కురుపాం,జూలై 14: పెన్ పవర్** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం కేంద్రం పరిధిలో గల గురుకుల బాలికల పాఠశాలను సోమవారం నాడు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సందర్శించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష హెచ్.సింహాచలం,మాట్లాడుతూ,పాఠశాలలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో విద్యార్థినుల పర్యవేక్షణ లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.నివాస పాఠశాలలో విద్యార్థినులు 24 గంటలు ఉంటారని,అలాంటి పరిస్థితిలో రాత్రి సమయంలో బాధ్యతా రహితంగా ఉండటం ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోతే విద్యార్థినుల భద్రత,ఆరోగ్య పరంగా ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రాత్రివేళ ఏ విద్యార్థినికైనా ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే స్పందించే పరిస్థితి లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు.గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల భద్రత,ఆరోగ్యం,సంక్షేమం విషయంలో యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని,రాత్రి వేళల్లో విధుల్లో ఉండాల్సిన ప్రధాన ఉపాధ్యాయులు సిబ్బందిని తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ ఘటనపై సంబంధిత గురుకుల విద్యాసంస్థల అధికారులు వెంటనే విచారణ చేపట్టి,విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు.అలాగే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు,వైద్య సేవలు,భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి.సురేష్,కార్యదర్శి బి.అనిల్,పాల్గొన్నారు.

# 87వ వార్డు లో శ్రీ వారాహి అమ్మ వారి నవరాత్రుల పూజ మహోత్సవములు.

**-ముఖ్య అతిథులుగా బిజెపి ఇంచార్జ్ కరణంరెడ్డి నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ బొండా జగన్**




**కూర్మన్నపాలెం పెన్ పవర్ జూలై 14** మహా విశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డు పరిధిలో మీ సేవ గ్రౌండ్లో శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి పూజ మహోత్సవములు అత్యంత వైభవంగా ప్రారంభించారు . పూజా కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కర్ణంరెడ్డి నర్సింగరావు, మాజీ స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ బుధవారం నుండి ప్రారంభం కాబోతున్న శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రుల పూజ మహోత్సవములు వేద పండితులు శ్రీహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని ప్రతి ఒక్కరూ ఈ పూజా మహోత్సవంలో పాలుపంచుకోవాలని ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆ అమ్మవారి కరుణ కటాక్షం పొందాలని కోరారు.

# తమ ఉదారత చాటుకున్న 108 సిబ్బంది...!

**పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళకు ప్రసవం చేసిన 108 సిబ్బంది.**



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 14:** పురిటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళకు ప్రసవం చేసి తమ ఉదారత స్వభావాన్ని దాటుకున్న 108 సిబ్బంది. మండలంలోని అతిమారుమూలన ఉన్న బుదరాళ్ల గ్రామానికి చెందిన లోవ కుమారి(30) పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబీకులు 108 సిబ్బందికి తెలియపరిచారు హుటా హుటిన 108 సిబ్బంది బుదరాళ్ల చేరుకొని లోవ కుమారిని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రధమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి బాగోలేదని నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ కి రిఫర్ చేయగా మార్గమధ్యలో గొలుగొండ మండలం జోగుంపేట సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువ పోవడంతో 108 సిబ్బంది ప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది తల్లి బిడ్డ క్షేమంగా ఉండటంతో 108 సిబ్బంది ఈఎంటి ఈశ్వరరావు పైలట్ వరప్రసాద్ కు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన జిల్లా అధికారులు.



**కురుపాం జూలై 14 పెన్ పవర్.**కురుపాం మండలం మొండెంకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మంగళవారం నాడు జిల్లా ఐసీటీసీ సూపర్వైజర్ అమ్మినాయుడు మరియు ఐసీటీసీ కౌన్సిలర్ ఎ.మోహనరావు సందర్శించి హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలును గురించి సమీక్షించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డా.సాహితీ మరియు ల్యాబ్ టెక్నీషియన్‌తో సమావేశమై,ఆసుపత్రికి వచ్చే గర్భిణులు,క్షయవ్యాధి రోగులు,లైంగిక వ్యాధులతో బాధపడుతున్న వారు,అధిక ప్రమాద వర్గాలకు చెందిన వ్యక్తులు మరియు ఇతర అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మొండెంఖల్ గ్రామంలో జరిగే మొబైల్ ఐసీటీసీ క్యాంపును సందర్శించి అక్కడ జరిజిన పరీక్షలను పరిశీలించారు.అదేవిధంగా హెచ్ఐవి పరీక్షల సంఖ్యను పెంచడం,ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఐసీటీసీ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయలని పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని వెంటనే ఏ.ఆర్.టి కేంద్రాలకు అనుసంధానం చేయడం,రికార్డుల నిర్వహణ,గోప్యత,నాణ్యమైన కౌన్సెలింగ్ మరియు సకాలంలో నివేదికల సమర్పణ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.అంతేకాక హెచ్ఐవిను ముందుగానే గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స ప్రారంభించి,వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు కొత్త ఇన్ఫెక్షన్లను నివారించవచ్చని తెలిపారు.అందువల్ల ప్రజలు ఎలాంటి భయం లేదా అపోహలు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్న హెచ్ఐవి పరీక్షలు మరియు కౌన్సెలింగ్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జె.తిరుపతి రావు మరియు మొబైల్ ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.ద

# జులై 31 కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి: సీఐటీయూ పిలుపు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జులై 14**: స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గడుతూరు సత్యనారాయణ పిలుపునిచ్చారు.మంగళవారం గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి సచివాలయంలో నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్కీం వర్కర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనం, ఈపీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జులై 31న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ఆశా వర్కర్లు, ఇతర స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పోతురాజు కృష్ణకుమారి, దేవరాజ్ లలిత, గడుతూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ జువ్వాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవాలు

### అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బెహరా భాస్కరరావు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 14 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 92వ వార్డు వెంకటాపురం మూడు గుళ్ల వద్ద జరుగుతున్న శ్రీ జువ్వాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించగా, అనంతరం ఆయన తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ జువ్వాలమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామీణ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షిస్తూ ఇలాంటి మహోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, ధవళ గోపాల్, కంపర కోటీశ్వరరావు, ఇల్లపు శంకరరావు, ఇల్లపు సురేష్, మనోహర్, ఇల్లపు నాగరాజు, ఇల్లపు వరహాలు, ఇవి రమణ, ధవళ మోహన్, రాంబాబు, బలిరెడ్డి శ్రీను, బెహరా సత్యనారాయణ, నరేష్, నీలాపు మహాలక్ష్మి రెడ్డి, రమేష్ రెడ్డి, రాపర్తి అప్పారావు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, త్రినాథ్ తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీ జువ్వాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తుల రాకపోకలతో సందడిగా మారింది.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గానకోకిల ఎస్.జానకికి విశాఖలో ఘన నివాళి

- మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి కార్యక్రమం
- భావోద్వేగంగా మధ్య అభిమానుల నివాళులు



**విశాఖపట్నం, పెన్ పవర్, జూలై 14 :** భారతీయ సినీ సంగీత ప్రపంచంలో తన మధుర గానంతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్న గానకోకిల ఎస్. జానకి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె మరణవార్త తెలుసుకున్న అభిమానులు, సినీ ప్రముఖులు, కళాకారులు పలు ప్రాంతాల్లో శ్రద్ధాంజలి కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలిసి ప్రముఖ గాయని ఎస్. జానకికి ఘనంగా నివాళులర్పించారు. సంఘ నాయకుడు పి.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జానకి ఆలపించిన ఎన్నో చిరస్మరణీయ గీతాలను వినిపిస్తూ ఆమె సంగీత సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, దీపాలు వెలిగించి మౌనం పాటిస్తూ అశ్రునివాళి ఘటించారు. కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు "మీ స్వరం చిరస్థాయిగా మా హృదయాల్లో నిలిచిపోతుంది", "గానకోకిలకు అశ్రునివాళి" అంటూ భావోద్వేగ సందేశాలు తెలియజేశారు. ఆమె గాత్రం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భారతీయ సంగీత చరిత్రలో ఎప్పటికీ చెరగని అధ్యాయంగా నిలిచిపోతుందని కొనియాడారు. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన సంగీత ప్రస్థానంలో సుమారు 52 వేల పాటలు ఆలపించిన ఎస్.జానకి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు అనేక భారతీయ భాషల్లో తన గాన మాధుర్యాన్ని చాటారు. భావవ్యక్తీకరణ, స్వర మాధుర్యం, ఉచ్చారణలో ప్రత్యేకతతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆమె మరణం భారతీయ సంగీత రంగానికి తీరని లోటని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, బి.ఈశ్వర ప్రసాద్, భరత్, సిహెచ్. చిన్నారావు, అప్పలరాజు, వేలంగిని, నాగలక్ష్మి, మంగ, రాణి, జ్యోతి, వెంకటలక్ష్మి తదితరులు, మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ సభ్యులు, సినీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని గానకోకిల ఎస్. జానకికి ఘనంగా నివాళులర్పించారు.

## 85వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



**కూర్మన్నపాలెం పెన్ పవర్, జూలై 14**

మున్సిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , విఎంఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశాల మేరకు, 85వ వార్డు అగనంపూడి తలారి వానిపాలెం బొర్రమాంబ ఆలయం వద్ద గ్రౌండ్, ఫార్మాసిటీ నిర్వాసితుల కాలనీ గ్రౌండ్ అభివృద్ధి పనులు చేయటానికి వీఎమ్ ఆర్ డిఏ అధికారులు పర్యటించడం జరిగింది. 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర గ్రౌండ్లు ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడతాయో అధికారులకు వివరించడం జరిగింది. వీలైనంత త్వరగా రక్షణ కూడా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి జిమ్ మెటీరియల్, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తామని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో వియంఆర్డీఏ అధికారులు, గాజువాక ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ శివశంకర్ జీవీఎంసీ అగనంపూడి జోన్ డి ఈ నారాయణ , హాస్పిటల్ డైరెక్టర్స్ డొక్కా రమేష్ , గజ్జల రవణమ్మ నూకరాజు, శీరంశెట్టి బాబ్జి, ఈగల పోలినాయుడు, ఉరుకూటి రాజు, ఉరుకూటి రామునాయుడు, ఎలమంచిలి వీరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే వైసీపీ డ్రామాలు




- శ్రీకాకుళం ఘటనను రాజకీయంగా మళ్లించే ప్రయత్నం చేస్తున్న వైసీపీ
- మత్స్యకారుల సంక్షేమం గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శ
- గల్లంతైన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం తక్షణ సాయం
- మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు తీవ్ర ఆరోపణలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 14 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం, గోపాలపట్నంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైన వైసీపీ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన పడవ ప్రమాదం నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ నాయకులు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందిస్తామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని, కానీ ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గణబాబు విమర్శించారు. తొలి రెండేళ్లలో నమోదైన 116 బీమా క్లెయిమ్‌లలో 52 క్లెయిమ్‌లను బడ్జెట్ లేదనే కారణంతో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. గత ఐదేళ్లలో సముద్రంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల సంఖ్య, వారికి చెల్లించిన పరిహారం వంటి వివరాలను ప్రభుత్వం ఎప్పుడూ అధికారికంగా వెల్లడించలేదని గణబాబు ప్రశ్నించారు. వందలాది కుటుంబాలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి ఉంటే, ఆ లబ్ధిదారుల వివరాలను ఎందుకు ప్రజల ముందుకు తీసుకురాలేదని నిలదీశారు. కనీసం ఒక అధికారిక శ్వేతపత్రాన్ని కూడా విడుదల చేయలేకపోవడం గత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారుల భద్రత కోసం అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని గణబాబు అన్నారు. రిప్ కరెంట్లు, పాత బోట్ల కారణంగా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ప్రతి ఏడాది అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ, ఆ మరణాల సంఖ్యను ప్రజలకు తెలియకుండా దాచిపెట్టారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం బయటపడకుండా అధికారిక గణాంకాలను ప్రజల ముందుకు తీసుకురాలేదని విమర్శించారు. అంతేకాకుండా, మత్స్యకారులకు అవసరమైన కనీస వలలు వంటి సదుపాయాలు కూడా గత ప్రభుత్వంలో అందించలేదని అన్నారు. శ్రీకాకుళం ఘటన జరిగిన వెంటనే కూటమి ప్రభుత్వం అధికారులు, కోస్ట్ గార్డ్, నావికాదళాన్ని అప్రమత్తం చేసి గల్లంతైన మత్స్యకారుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు ప్రారంభించిందని గణబాబు తెలిపారు. ఇప్పటికీ వారి ఆచూకీ కోసం నిరంతరంగా శోధన కొనసాగుతోందని చెప్పారు. ప్రమాదం జరిగి 72 గంటలు గడిచినా గల్లంతైన వారి ఆచూకీ లభించకపోవడంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని గణబాబు వెల్లడించారు. ఇందులో మత్స్యశాఖ ద్వారా రూ.5 లక్షలు, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మరో రూ.5 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కారి చిన్న కుటుంబాన్ని కూడా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని గణబాబు పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఘనంగా శ్రీ మొదకొండమ్మ అమ్మవారి నెల పండుగ మహోత్సవం





- అన్న సమారాధనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు
- భక్తులకు స్వయంగా ప్రసాదాల పంపిణీ

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 14 :** విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 92వ వార్డు ఇందిరానగర్‌లో కొలువై ఉన్న శ్రీ మొదకొండమ్మ అమ్మవారి నెల పండుగ మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా గణబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, విశాఖ పశ్చిమ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్న గణబాబు, భక్తులకు స్వయంగా అమ్మవారి అన్నప్రసాదాన్ని అందించి వారి ఆశీర్వాదాలు పొందారు. భక్తులతో కలిసి ఆత్మీయంగా మమేకమవుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సేవాభావం మరియు సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని, అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారపల్లి సత్తిరాజు, దాడి రమేష్, తులసి రామ్ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తుల కోసం ఆలయ కమిటీ చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసలు అందుకున్నాయి.

## చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి బదిలీ నిలిపివేయాలి

జిజెఎస్ఎస్ అధ్యక్షులు ముర్ల వెంకటరమణ విజ్ఞప్తి



**గూడెం కొత్తవీధి/ చింతపల్లి,పెన్ పవర్,జులై 14:** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి యొక్క బదిలీని నిలిపివేసి, ఆమె సేవలను కళాశాలకు కొనసాగించాలని గిరి జన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షులు ముర్ల వెంకటరమణ మాస్టారు,ఈ ప్రాంత ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రిన్సిపాల్ విజయభారతి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కళాశాల విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, అకాడమిక్ ప్రగతిలో విశేష మార్పు చోటుచేసుకుందని వారు పేర్కొన్నారు. గతంలో పెద్దగా గుర్తింపు లేని కళాశాల ప్రస్తుతం విద్యా నాణ్యత, వినూత్న కార్యక్రమాల నిర్వహణతో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.ఆమె నాయకత్వంలో జాతీయ స్థాయి సెమినార్లు నిర్వహించి చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. దీంతో స్థానిక విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా ఈ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం కళాశాలలో నూతన భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్న కీలక సమయంలో ప్రిన్సిపాల్‌కు బదిలీ జరగడం అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే విజయభారతి సేవలు కళాశాలకు అవసరమని అభిప్రాయపడ్డారు.అందువల్ల విద్యాశాఖ ఉన్నతాధికారులు మానవీయ దృక్పథంతో స్పందించి, ప్రిన్సిపాల్ విజయభారతి యొక్క బదిలీని నిలిపివేయాలని వారు కోరుతున్నారు. మంచి ప్రిన్సిపాల్‌ను కొనసాగించడం ద్వారా కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## గోపాలపట్నం సీహెచ్‌సీ అభివృద్ధికి మరిన్ని చర్యలు-అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రభుత్వ విప్ గణబాబు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 14 :** స్థానిక గోపాలపట్నంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అంశాలపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల నాణ్యత, అవసరమైన మందుల నిల్వలు, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, మౌలిక వసతుల మెరుగుదల, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా చేరేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు ఆసుపత్రిలోని వివిధ వార్డులను స్వయంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, వైద్యులు, సిబ్బంది సేవలు, మందుల లభ్యత, పరీక్షలు, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని, వైద్య పరికరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని గణబాబు పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి, మెరుగైన చికిత్స అందించడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవల ప్రతిష్ఠను నిలబెట్టాలని ఆయన అన్నారు.



ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వ్యవస్థలో కరువైన కనికరం!

- గిరిజన గర్భిణి కష్టాన్ని కూడా గుర్తించని గుడ్డి అధికారులు.
- కొయ్యూరు ఎంపీడీఓ ఆఫీస్ టార్గెట్ గిరిజనులేనా?
- ఎస్ఐ కిశోర్ వర్మకు బాధితుల వినతిపత్రం.
- నేటి నుండి కొయ్యూరులో న్యాయపోరాట హోరు.



**అల్లూరి జిల్లా కొయ్యూరు, పెన్ పవర్ జులై 14 :** మండలంలోని చీడిపాలెం పంచాయితీ చీడి పాలెం గ్రామానికి చెందినకాకూరు లోవదేవి, కాకూరు సుధారాణి అనే ఇద్దరు గిరిజన సోదరీమణులకు జరిగిన ఘోర అన్యాయంపై బుధవారం నుండి న్యాయం జరిగేంత వరకు పోరాటానికి వారు సిద్ధమయ్యారు. బాధితురాలైన కాకూరు లోవదేవికి నిబంధనల ప్రకారం వీఆర్పీ పోస్టు మంజూరైనప్పటికీ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఒత్తిడి మరియు సిఫార్సుల వల్లే ఆమెను విధుల్లోకి తీసుకోకుండా తొలగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఆమె చెల్లెలు సుధారాణి వీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న తరుణంలో, అనుకోని మెడికల్ ఎమర్జెన్సీ వల్ల కడుపులోనే బిడ్డ మరణించిన అత్యంత బాధాకరమైన క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంది. అంతటి పురిటి శోకంలో ఉన్న మహిళ పట్ల ఏమాత్రం మానవత్వం లేకుండా, నిర్ణీత సమయంలో పని దినాలు పూర్తి చేయించలేదన్న నెపంతో ఆమెను కూడా ఉద్యోగం నుండి నిర్దాక్షిణ్యంగా తొలగించడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. తమకు జరిగిన ఈఅన్యాయాలపై శాంతియుత మార్గంలో టెంట్ వేసి నిరసన తెలిపేందుకు సిద్ధమైన బాధిత సోదరీమణులు, మంగళవారం కొయ్యూరు ఎస్ఐ కిశోర్ వర్మను కలసి ముందస్తు అనుమతి కోసం వినతిపత్రం అందజేశారు. కొయ్యూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న ఈ గిరిజన మహిళల ఆక్రందనపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, రాజకీయ జోక్యాన్ని పక్కనబెట్టి వారికి తక్షణమే విధులను పునరుద్ధరించి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని వారు కోరుతున్నారు.

# విజ్ఞాన్ లో సెక్యూర్ క్లౌడ్ కంప్యూటింగ్ పై అవగాహన సదస్సు



**కూర్మాన పాలెం: పెన్ పవర్,జూలై 14:**దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో ప్రముఖ సంస్థ ఈడబ్ల్యుబీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సహకారంతో సెక్యూర్ క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు.

విద్యార్థులకు విద్యాసంస్థల్లో పొందుతున్న సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేస్తూ, క్లౌడ్ టెక్నాలజీలపై వాస్తవ ప్రపంచ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈడబ్ల్యుబీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు భాను ప్రకాష్ ముఖ్య వక్తగా పాల్గొని, క్లౌడ్ కంప్యూటింగ్ మౌలికాంశాలు, ఆర్కిటెక్చర్, ఆధునిక డిజిటల్ యుగంలో దాని అనువర్తనాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.

క్లౌడ్ సర్వీస్ మోడల్స్ ఐఏఏఎస్, పీఏఏఎస్, ఎస్ఏఏఎస్, డిప్లాయ్మెంట్ మోడల్స్, వర్చువలైజేషన్, క్లౌడ్ భద్రతా సవాళ్లు వంటి కీలక అంశాలను వివరించారు. క్లౌడ్ రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు, కెరీర్ అభివృద్ధిలో సర్టిఫికేషన్ల ప్రాధాన్యాన్ని వివరించారు.

ఈ కార్యక్రమంలో మూడో సంవత్సరం బి.టెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు అమెజాన్ వెబ్ సర్వీసెస్ మైక్రోసాఫ్ట్ అజ్యూర్, గూగుల్ క్లౌడ్ వంటి ప్రముఖ క్లౌడ్ ప్లాట్ఫారమ్లపై తమ సందేహాలను నివృత్తి చేసుకుంటూ చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. ఇంటరాక్టివ్ విధానంలో నిర్వహించిన ఈ సెషన్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వై. కుమార్ శేఖర్, నవీన్ పాల్గొని, విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న క్లౌడ్ టెక్నాలజీలను అధ్యయనం చేయాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డా. కె. రోహిత్ కుమార్ మాట్లాడుతూ, ఈడబ్ల్యుబీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అందించిన విలువైన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్య కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక పరిణామాలకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.

# కాలభైరవుడికి శ్రీ స్వర్ణాకర్షణ భైరవ కల భైరవ కాలరాత్రి అమావాస్య సందర్భంగా మహాభిషేకం



**గాజువాక: పెన్ పవర్, జులై 14:**జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య 250 సంవత్సరాలకు ఒక్కసారి అధికమాసంలో వచ్చే అమావాస్యను శ్రీ స్వర్ణాకర్షణ భైరవ కల భైరవ కాలరాత్రి అమావాస్య అంటారు. పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీనివల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాల భైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిధ్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపెంటకోట రాజు, పాండురంగ జయరాజ్, హరికృష్ణ, బి. వెంకటేష్, జ్యోతి, ఆదిలక్ష్మి, పద్మ, చిట్టమ్మ, వరలక్ష్మి , రామ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

# బుదరాళ్ల పాఠశాల విద్యార్థులకు లక్ష రూ.తో స్టేషనరీ పంపిణీ చేసిన పిఆర్టియూ సంఘం...!



- ఎమ్మెల్సీ గాది శ్రీనివాసుల నాయుడు చేతుల మీదుగా పంపిణీ...
- పి ఆర్ టి యు యూనియన్ ఔదార్యం...

**కొయ్యూరు,పెన్ పవర్ జూలై 14:** మండలంలోని బుదరాళ్ల లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గల పేద విద్యార్థులకు పిఆర్టియూ సంఘం ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువగల పుస్తకాలను,పెన్నలను ఉత్తరాంధ్ర ఎం ఎల్ సి డాక్టర్ గాదె శ్రీనివాసాల నాయుడు , జిల్లా సంఘం అధ్యక్షుడు డిజీ నాథ్, మండల అధ్యక్షులు వెంపాటి తలుపులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడ పాఠశాల ను సందర్శించిన వారు పిల్లల కు వీటిని పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల శిధిలావాస్తకు చేరిన పరిస్థితి,ఉపాధ్యాయులు లేక మూతబడే వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పాఠశాలలో చదివే వారికి పిఆర్టియు సహకరించాలనేనే ముందుకు వచ్చి పిల్లలకు (60) కి తమ సంఘం ద్వారా ఎమ్మెల్సీ శ్రీనివాసుల నాయుడు, డి జి నాథ్ వెంపాటి తలుపులు చేతుల మీదుగా పంపిణీ చేశారు పుస్తకాలు,పెన్నులు, పెన్సిల్స్ అందించి వారి ఔదార్యం చాటుకున్నారు.ఇప్పటికే పాడేరు నియోజకవర్గంలో చింతపల్లి,దుంబ్రిగుడ, జికెవీధి,మండలంలో నిరుపేద గిరిజనవిద్యార్థులకు పి ఆర్ టి యు సంఘం తరుపున సుమారు 4 లక్షలవిలువగలపుస్తకాలు,పెన్నులు, పెన్సిల్స్ అందజేసినట్టు తెలిపారు..ఈ కార్యక్రమంలో పి ఆర్ టియు సంఘం అధ్యక్షుడు ,నర్సీపట్నం మండలం సంఘం సహాయ సహకారం తో వీటిని పంపిణీ చేస్తునట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు,ఉపాధ్యాయులు లకె. సురేష్ కుమార్ తదితరులుపాల్గొన్నారు..

# ప్రభుత్వ కాలేజీలో “డ్రగ్స్ వద్దు బ్రో” అవగాహన సదస్సు

- మత్తుకు బానిసై కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనం.
- ప్రభుత్వ ఉద్యోగాలకు శాశ్వతంగా దూరం.
- ముంచంగిపుట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ శంకర్ రావు.
- ఎన్ డి పిఎస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ జీ అప్పన్న



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 14.**పోలీస్ కమ్యూనిటీ పోలీసింగ్ చొరవలో భాగంగా అల్లూరి జిల్లా, ముంచింగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మరియు యువతకు డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై మంగళవారం స్థానిక ఎస్సై పి నాని ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్.డి.పి.ఎస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. అప్పన్న జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శంకరరావు, సోషల్ మీడియా సబ్ ఇన్స్పెక్టర్ భవానీ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మద్యం సేవించడం వల్ల కలిగే తీవ్ర అనర్థాలు, వాటి వల్ల జీవితాలు ఎలా నాశనమవుతాయి, చట్టపరమైన కఠిన శిక్షల గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. ప్రస్తుత కాలంలో యువతను ఆకర్షిస్తున్న అక్రమ ఆన్లైన్ బెట్టింగ్ యాప్ల వల్ల జరిగే ఆర్థిక నష్టాలతో వాటికి దూరంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధకం, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిబంధనలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు బడి మానేసే పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వంటి పలు కీలక సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న విద్యార్థులందరితో మత్తు పదార్థాలకు (డ్రగ్స్, గంజాయి, మద్యం) దూరంగా ఉంటామని, సైబర్ నేరాల బారిన పడకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతామని పోలీస్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తును కాపాడుకుందాం మాదకద్రవ్యాలకు దూరంగా అలవాటు చేసుకుందాం





**జి.మాడుగుల.పెన్ పవర్.జుల్లై(14)** జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ డేగలరాయి గ్రామంలో దేశానికే యువత వెన్నుముక అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతూ యువత ఏ విధమైన మాదకద్రవ్యాలకు అలవాటు చేసుకోకుండా ఉండటం కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీం ఆధ్వర్యంలో ఊరు రా వాడ వాడ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి యువత మేలుకో అనే నినాదంతో యువతకు ఏ విధమైన చెడు అలవాట్లు అలవాటు పడకుండా ఈగల్ టీం ఆధ్వర్యంలో ఉండేందుకు చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో ఈగల్ టీం సీఐ మరియు జిమాడుగుల ఎస్సై సాయిరాం పడాల్ అలాగే ఆర్ఎస్ ఐ సిబ్బంది పాల్గొన్నారు

# డాక్టర్ వంపూరు గంగులయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జులై 14**: రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యను మంగళవారం పాడేరు కేంద్రంలో మాజీ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వసుపరి ప్రసాద్, గూడెం కొత్తవీధి మండల వైస్ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ నాయకుడు సప్పగడ్డ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూడెం కొత్తవీధి మండలానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలపై వారు చర్చించినట్లు తెలిసింది. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు సమాచారం.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 14**:ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ పాడేరు మోదకొండమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ పూజల్లో పాల్గొన్నారు.అనంతరం డాక్టర్ వంపూరు గంగులయ్య మీడియాతో మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ కుడి భుజం నొప్పితో చాలాకాలంగా బాధపడుతున్నారని తెలిపారు. వైద్యులు పలుమార్లు శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించినప్పటికీ, ప్రజాసేవలో నిమగ్నమై ఉండటంతో ఆయనకు ఆపరేషన్ చేయించుకునే అవకాశం లభించలేదన్నారు. ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తయిందని, ఆయన త్వరితగతిన కోలుకుని మళ్లీ ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కిట్లంగి పద్మ, ఎన్. మురళీకృష్ణ, ఎస్. రామ్మూర్తి, త్రిమూర్తులు, బి. దివ్యలత, ఎం. నగేష్, ఎం. రాంబాబు, ఆర్. అప్పలకొండ బాబు, యూకే చరణ్, వి. సురేష్, ఎన్. కోటి, వి. కోటి తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రం ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయింది

**ముద్రగడ పద్మనాభం మరణం పట్ల వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కే కే రాజు దిగ్భ్రాంతి**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 14:**కాపు సామాజిక వర్గానికి న్యాయం కోసం నిరంతరం పోరాడిన ప్రముఖ నాయకులు,మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మరణం అత్యంత బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేకే రాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ముద్రగడ పద్మనాభం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం కృషి చేశారని ఆయన కొనియాడారు. ఆయన మరణంతో రాష్ట్రం ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయిందన్నారు.

ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, అనుచరులకు కేకే రాజు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# రైల్వేలో భద్రతే ప్రథమ ప్రాధాన్యత



* వర్క్‌సైట్ భద్రతకు పెద్దపీట - రైల్‌మదద్ ఫిర్యాదులపై వేగంగా చర్యలు:
* ఎస్‌సీఓఆర్ జీఎం సందీప్ మధుర్

**విశాఖ తూర్పు పెన్ పవర్ జూలై 14:** దక్షిణ తీర రైల్వే జోన్‌లో వర్క్‌సైట్ భద్రత, రైల్‌మదద్ ఫిర్యాదుల పరిష్కారం మరియు ప్రయాణికుల సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని దక్షిణ తీర రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథుర్ ఆదేశించారు. ఎస్‌సీఓఆర్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైల్వేలో భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. వర్క్‌సైట్‌లలో నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సిబ్బందికి అవసరమైన భద్రతా పరికరాలు అందించాలని, పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ఉద్యోగులు, ప్రయాణికుల భద్రత కోసం బలమైన భద్రతా సంస్కృతి అవసరమని నొక్కి చెప్పారు.

రైల్‌మదద్ ద్వారా వచ్చే ప్రయాణికుల ఫిర్యాదులపై కూడా ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, ప్రతి ఫిర్యాదుదారుడికి వృత్తిపరంగా, సంతృప్తికరంగా స్పందించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారమైన తర్వాత నాణ్యమైన ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. ఫిర్యాదుల ట్రెండ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి, పునరావృతమయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్‌సీఓఆర్‌కు చెందిన ప్రిన్సిపల్ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు పాల్గొని తమ పరిధిలోని భద్రతా చర్యలు, ఫిర్యాదుల పరిష్కారంపై నివేదిక సమర్పించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నీరు లేక బీడువారిన 90 ఎకరాలు..







**రైతుల ఆందోళనతో రాజీనామా చేసిన నీటి సంఘం డైరెక్టర్**

**కొత్తపేట, పెన్ పవర్, జూలై 14:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామపంచాయతీ పరిధిలోని వాడపాలెం లాకు పైన, వానపల్లి ప్రధాన పంటకాలువ నుంచి ఎడమ వైపు బిళ్లకుర్రు వైపు ప్రవహించే ప్రధాన సాగునీటి కాలువకు నీరు అందక సుమారు 90 ఎకరాల ఆయకట్టు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటోంది. సాగు సీజన్ ప్రారంభమైనా కాలువలో చుక్క నీరు లేక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

యెళిశెట్టివారిపాలెం, నక్కవారిపేట, దేగలవారిపాలెం, వాకాడవారిపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు, కౌలు రైతులు గత వారం రోజులుగా సాగునీటి కోసం ఆందోళన చేపడుతున్నారు. నారుమళ్లు వేసే సమయంలో కూడా నీరు అందకపోవడంతో కొందరు రైతులు వేసిన నారుమళ్లు ఎండిపోతుండగా, మరికొందరు ఇంకా సాగు ప్రారంభించలేక పొలాలను బీడుగా వదిలేశారు. మంగళవారం నిరసన తలపెట్టి ఎండిపోయిన పంటకాలువలోనే రైతులు కూర్చొని "మా కాలువకు నీరు ఇవ్వండి" అంటూ నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘం ప్రతినిధులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతులు చేతుల్లో పురుగుల మందు డబ్బాలు పట్టుకుని, వెంటనే నీరు అందించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేసింది.

కౌలు రైతులు మాట్లాడుతూ, ఎకరాలకు వేలాది రూపాయలు కౌలు చెల్లించి, అప్పులు చేసి వ్యవసాయానికి సిద్ధమయ్యామని, మహిళలు పుస్తెలతాడులు సైతం తాకట్టు పెట్టి పెట్టుబడులు సమకూర్చారని, ఇప్పుడు నీరు లేక పంటలు వేయలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతుల నిరసన సెగ.. నీటి సంఘం డైరెక్టర్ రాజీనామా**

రైతుల ఆందోళన తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో నీటి సంఘం డైరెక్టర్ ఎళిశెట్టి వీర్రాజు తన పదవికి రాజీనామా ప్రకటించారు. "రైతులకు నీరు ఇప్పించలేని పదవిలో కొనసాగడం వల్ల ప్రయోజనం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులను ఎన్నిసార్లు కోరినా స్పందన లేదు. రైతులకు న్యాయం చేయలేని ఈ పదవి నాకు అవసరం లేదు" అంటూ ఆయన రాజీనామాను ప్రకటించారు. ఆయన నిర్ణయం రైతుల్లో మరింత చర్చనీయాంశమైంది.

**నిరసన ప్రాంతానికి చేరుకున్న అధికారులు.. త్వరలో నీరు అందిస్తామని హామీ**

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న కొత్తపేట ఎమ్మార్వో రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇరిగేషన్ ఏఈ మాధవ్ నిరసన ప్రాంతానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎమ్మార్వో రాంబాబు, పై అధికారులతో వెంటనే చర్చించి వాడపాలెం పైకాలువకు సాగునీరు విడుదల చేసే చర్యలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు త్వరలోనే నీరు అందించేలా ప్రయత్నాలు చేస్తామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

అధికారుల హామీపై రైతులు స్పందిస్తూ, మాటలు కాకుండా వెంటనే కాలువలో నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీరు విడుదలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సుమారు 90 ఎకరాల ఆయకట్టును కాపాడేందుకు ప్రభుత్వం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## భీమా పరిహారం జాప్యంతో రైతుల్లో ఆందోళన

* ప్రీమియం చెల్లింపుపై సందిగ్ధం
* పెండింగ్ పరిహారం విడుదల చేయాలని కోలంక రైతుల విజ్ఞప్తి

**కాజులూరు, పెన్ పవర్, జూలై 14:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంటల భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. గత ఏడాది ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటికీ భీమా పరిహారం అందకపోవడంతో ఈ ఏడాది ప్రీమియం చెల్లించాలా వద్దా అనే అయోమయంలో ఉన్నారు. గత ఏడాది 'మెంతా' తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్నప్పటికీ, నష్టాలను అధికారులు నమోదు చేసినా అర్హులైన రైతులందరికీ భీమా పరిహారం అందలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కోలంక గ్రామ రైతులు పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న భీమా పరిహారాన్ని వెంటనే విడుదల చేసి, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన భీమా ప్రీమియం చెల్లింపు విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రైతులకు భరోసాగా ఉండాల్సిన పంటల భీమా పథకంలో పరిహారం మంజూరులో జాప్యం రైతుల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

## గౌరవ వేతనాలు మంజూరు చేయండి

* ఎంపీటీసీ సభ్యుల డిమాండు
* మంజూరు చేయకుంటే ప్రత్యక్ష పోరాటం



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 14;** దీర్ఘకాలికంగా యేళ్ల తరబడి మంజూరు కాకుండా నిలిచిపోయిన మండల పరిషత్ ప్రాదేశిక కౌన్సిల్ (ఎంపీటీసీ) సభ్యుల గౌరవ వేతనాలను మంజూరు చేయాలని మండల సమాఖ్య సభ్యులు డిమాండు చేశారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఎంపీటీసీల సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు గౌరవ వేతనాలను గత మూడేళ్ల నుంచి విడుదల చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు పరిస్థితి ఈవిధంగా ఉంటే ప్రజల పరిస్థితి ఇంకే విధంగా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్క ఎంపీటీసీకి సుమారు రూ 1.06 లక్షల బకాయి ఉందని తెలియజేశారు. దీంతో మండలంలోనున్న 22 ఎంపీటీసీ సభ్యులకు సుమారు రూ 2.25 కోట్ల వరకూ బకాయి ఉంటుదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానిమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎంపీటీసీల పట్ల ప్రభుత్వ కక్షపూరిత వైఖరి తగదని వారు వ్యాఖ్యానించారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఏ రాజుకు అందజేశారు. జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు వాసంశెట్టి దుర్గాభవానీ, నేలపూడి రత్నకుమారి. నెక్కంటి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణా కార్యక్రమం




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 14 :** కాకినాడ జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గోవిందాపురం మరియు మల్లిసాల గ్రామాలలో మామిడి, జీడిమామిడి మరియు ఆయిల్ పామ్ పంటలలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై జగ్గంపేట ఉద్యాన శాఖ అధికారి ఎ. శ్రీవల్లి ఒకరోజు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీఏఆర్ ఎన్ఐఆర్‌సీఏ కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్లకు చెందిన ఎన్.రఘునందన్, ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్తగా పాల్గొన్నారు. మామిడి మరియు జీడిమామిడి పంటలలో కోత అనంతర కేనోపీ నిర్వహణ, పోషక యాజమాన్యం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సారాన్ని పెంపొందించడంలో జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ పామ్ పంటలో సమగ్ర పోషక యాజమాన్యం, ఎరువులు మరియు సూక్ష్మపోషకాలను సరైన సమయంలో వేయడం, వేసిన ఎరువులను మట్టితో కప్పడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, మొక్కల సంరక్షణ చర్యలు, అలాగే ఎల్ నినో పరిస్థితుల్లో పంటలను సంరక్షించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, ఉద్యాన శాఖ సిబ్బంది, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అన్నవరం, తలుపులమ్మ లోవలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు





**కాకినాడ, పెన్ పవర్,జూలై 14:** జిల్లాలోని ప్రముఖ దేవస్థానాలైన అన్నవరం, తలుపులమ్మ లోవ పరిసరాల్లో సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అటవీ,దేవాదాయ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,భక్తులు, వ్యాపారుల్లో అవగాహన కల్పించి ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే అన్నవరం ఎకో పార్కును మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి, పరిశుభ్రత, హరితాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అటవీ--దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేసి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు, అన్నవరం, తలుపులమ్మ లోవ ఈవోలు, అటవీ, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూకాంబిక ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం.



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 14;** మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, ఆలయ చైర్మన్ వీరి అప్పారావు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సమక్షంలో ఆలయ అభివృద్ధికి పెదపళ్లకు చెందిన స్వర్గీయ శీని సర్వేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె, అల్లుడు దాతలు లక్ష్మిపురంకు చెందిన ధోనెల్లి చౌదరి, ఉమామహేశ్వరి దంపతులు మంగళవారం రూ. 1,00,100 విరాళంగా చెక్కును అందజేశారు. స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు, కూటమి సభ్యుల సూచనల మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులలో భాగంగా ఈరోజు ఆలయ ప్రాంగణంలో 50వ చండీ హోమం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శనం చేసుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వీర్రాజు చౌదరి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ముఖమండపం, ఆలయ ప్రాకారాలు, గాలిగోపురాల నిర్మాణానికి ప్రణాళికలు రచించి, ఆచరిస్తూ ఆలయ రూపరేఖలలో మార్పులు చేస్తూ నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆలయం, ప్రాకారాల మధ్య ఖాళీ ప్రదేశంలో నాపరాయితో ఫ్లోరింగ్, ఆలయం చుట్టూ సిసి ఫ్లోరింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకారాన్ని అందించి అహర్నిశలు కృషి చేస్తున్న గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, దేశ, ఇతర దేశాలకు చెందిన ఎందరో దాతలు ఉన్నారని అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజులలో యాత్రికులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకుని వస్తున్నట్లు ఈవో వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు, గ్రామ పెద్దలు గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, వైట్ల గంగరాజు, పసుపులేటి వీరబాబు, కాలా సూరిబాబు,దొమ్మేటి రామకృష్ణ, అర్చకులు, ఆసాధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

# ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తర్వాత టీమిండియా కోచ్‌ల్లో ఒకరు రాజీనామా?

## టెన్ డూస్కాటే రాజీనామాకు సిద్ధమైనట్లు కథనం
## బీసీసీఐకి నిర్ణయం తెలిపినట్లు సమాచారం
## ఇంగ్లండ్ సిరీస్ తర్వాత తప్పుకొనే అవకాశం
## వ్యక్తిగత కారణాలతోనే నిర్ణయమని సమాచారం
## కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని భావన




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ముగిసిన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని ఇప్పటికే బీసీసీఐకి తెలియజేసినట్లు క్రిక్‌బజ్ కథనం వెల్లడించింది. బీసీసీఐతో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరిస్తే, ఇంగ్లండ్‌తో చివరి వన్డే అతడికి భారత జట్టుతో ఆఖరు మ్యాచ్ కానుంది.

టెన్ డస్కాటే నిర్ణయానికి అసంతృప్తి కారణం కాదని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో పాటు కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. లండన్‌లో నివసిస్తున్న తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపడంతో పాటు తక్కువ ప్రయాణాలు ఉండే బాధ్యతలను స్వీకరించాలని అతడు భావిస్తున్నట్లు వెల్లడించింది. రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయ కోచ్‌గా టెన్ డస్కాటే బాధ్యతలు చేపట్టాడు. అతడి తొలి ఒప్పందం కూడా ఇటీవలే ముగిసినట్లు సమాచారం. గౌతమ్ గంభీర్ సిఫార్సుతోనే అతడు కోచింగ్ బృందంలో చేరగా, రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయంలో గంభీర్‌కు కూడా అభిప్రాయం చెప్పే అవకాశం ఉందని కథనం పేర్కొంది.

అయితే అతడి రాజీనామాను అడ్డుకునే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలిపింది. మరోవైపు, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ల్లో గంభీర్‌కు పూర్తి స్థాయి జట్టు అందుబాటులో లేదన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా లేకపోవడం ప్రభావం చూపిందని చెప్పాడు. రెండు సిరీస్‌ల్లో ఓడిపోయినంత మాత్రాన గంభీర్‌ను విమర్శించడం తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించాడు.

# ఎడ్జ్‌బాస్టన్ లో భారత బౌలర్ల జోరు.. 258 పరుగులకే ఇంగ్లండ్ ఆలౌట్

- భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో 258 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్
- 76 పరుగులతో అజేయంగా నిలిచి ఒంటరి పోరాటం చేసిన జో రూట్
- 68 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడిన లియామ్ డాసన్
- నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించిన స్పిన్నర్ అక్షర్ పటేల్
- భారత బౌలర్ల ధాటికి కుప్పకూలిన ఇంగ్లండ్ టాప్ ఆర్డర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టును 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌట్ చేశారు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, మాజీ కెప్టెన్ జో రూట్ (76 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్ (68) అర్ధశతకంతో రాణించాడు. దీంతో టీమిండియా ముందు 259 పరుగుల లక్ష్యం నిలిచింది.ఇన్నింగ్స్ ఆరంభంలో ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే, ఈ దశలో భారత బౌలర్లు పుంజుకున్నారు. కేవలం 19 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ 4 కీలక వికెట్లు కోల్పోయి 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు క్యూ కట్టారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన జో రూట్, లియామ్ డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 121 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. డాసన్ ఔటయ్యాక, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. చివర్లో జోఫ్రా ఆర్చర్ (12) వేగంగా ఆడినా, అక్షర్ తన స్పిన్‌తో టెయిలెండర్లను చుట్టేశాడు.భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ, అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ చెరో 2 వికెట్లు తీశారు. జస్ప్రీత్ బుమ్రా, శివమ్ దూబేలకు తలో వికెట్ దక్కింది. బుమ్రా తన 9 ఓవర్లలో కేవలం 31 పరుగులే ఇచ్చి ఇంగ్లండ్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. కీలకమైన కెప్టెన్ హ్యారీ బ్రూక్ వికెట్ ను తన ఖాతాలో వేసుకున్నాడు.

# ఒకే స్టేడియం.. ఒకే మ్యాచ్.. మాట్లాడుకోని గంభీర్, కోహ్లీ.. భారత జట్టులో మళ్లీ కోల్డ్ వార్?






**హైదరాబాద్ పెన్ పవర్:** జశీశ్రీఐ ఝొతీ~ాస్త్రుఖలఅ ఖశీప్త్రీఅ జం +ఖఎప్త్రఅతీ: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న 3 వన్డేల సిరీస్‌కు ముందు భారత జట్టులో కోల్డ్ వార్ కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అనే అనుమానాలు ఇప్పుడు ఫ్యాన్స్ ని తెగ వేధిస్తున్నాయి. బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లాండ్‌తో తొలి వన్డేకి ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్స్ లో ఈ ఇద్దరు కనీసం మాట్లాడుకోలేదని వస్తున్న వార్తలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

**నెట్స్‌లో కనిపించని కెమిస్ట్రీ:**
ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్‌ను గంభీర్ చాలా నిశితంగా గమనించారు. కానీ నేరుగా కింగ్ కోహ్లీ దగ్గరికి వెళ్లి సలహాలు ఇవ్వకుండా, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ద్వారా సందేశాలు పంపడం గమనార్హం. ఈ సెషన్‌లో అనవసర షాట్లకు ప్రయత్నించి కోహ్లీ కొన్నిసార్లు క్లీన్ బౌల్డ్ కావడంతో, గంభీర్ స్వయంగా వెళ్లిపోకుండా.. బ్యాటింగ్ కోచ్‌కు చెప్పి కోహ్లీతో మాట్లాడించారు. ఈ ఇండైరెక్ట్ కమ్యూనికేషన్ కి సంబంధించిన వీడియో ఒక్కసారిగా నెట్టింట వైరల్ కావడంతో, వీరిద్దరి మధ్య మళ్లీ లొల్లి స్టార్ట్ అయిందనే ప్రచారం జరుగుతుంది.

**గిల్, రోహిత్‌లతో మాటలు.. కోహ్లీతో మాత్రం నో టాక్స్:**
ప్రాక్టీస్ ముగిసిన తర్వాత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్టేడియంలో రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌లతో పాటు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్‌తో సుదీర్ఘంగా మాట్లాడాడు. కానీ, భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో మాత్రం ఒక్కసారిగా మాట్లాడినట్లు ఎక్కడ కూడా కనిపించలేదు. అటు కోహ్లీ కూడా గంభీర్ సైడ్ వెళ్లేందుకు కూడా ప్రయత్నిం చేయలేదు. ఈ నిశ్శబ్ద యుద్ధం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న కోల్డ్ వైబ్స్ కు అద్దం పడుతోందని ఇంటర్నేషనల్ మీడియా కోడైకూస్తుంది.



వెల్వెట్ బ్లాక్ దుస్తుల్లో 'పవర్ గ్లామర్'ను ప్రదర్శిస్తున్న శామా సికందర్

# ఆన్‌స్క్రీన్ ఫ్లాప్.. ఆఫ్‌స్క్రీన్ సూపర్ హిట్!



సినిమా ఇండస్ట్రీలో హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ చిగురించడం, ఆ తర్వాత వారు పెళ్లి బంధంతో ఒక్కటవ్వడం మనం తరచూ చూస్తూనే ఉంటాం. అయితే ఆశ్చర్యకరంగా టాలీవుడ్‌లో కొంతమంది స్టార్స్ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోరంగా ఫ్లాప్ అయ్యాయి. కానీ, ఆ సినిమాలే వారి జీవిత భాగస్వాములను వారికి పరిచయం చేశాయి. ఆన్‌స్క్రీన్‌పై ఫ్లాప్ అయినప్పటికీ, ఆఫ్‌స్క్రీన్‌లో సూపర్ హిట్ అయిన ఆ క్రేజీ రియల్ లైఫ్ జంటల ముచ్చట్లు మీకోసం..

**జీవిత – రాజశేఖర్:**
టాలీవుడ్ సీనియర్ కపుల్ యాంగ్రీ స్టార్ రాజశేఖర్, జీవితలది ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ. వీరిద్దరూ 'తలంబ్రాలు' సినిమాతో తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఇక ఆ సినిమా టైమ్‌లోనే వీరిద్దరి ఆలోచనలు కలవడంతో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 1991లో పెళ్లి చేసుకున్న ఈ సీనియర్ జంట ఇప్పటికీ ఇండస్ట్రీలో బెస్ట్ కపుల్‌గా కొనసాగుతున్నారు.

**మహేష్ బాబు – నమ్రత శిరోద్కర్:**
టాలీవుడ్‌లోనే మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ క్రేజీ కపుల్ ఎవరంటే మహేష్ బాబు, నమ్రత జంట అని కచ్చితంగా చెప్పొచ్చు. వీరిద్దరూ కలిసి 'వంశీ' అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎంత పెద్ద ఫ్లాప్ అయిందో అందరికీ తెలిసిందే. కానీ ఈ సినిమా షూటింగ్ సమయంలోనే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్నారు.

**వరుణ్ తేజ్ – లావణ్య త్రిపాఠి:**
మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి లవ్ స్టోరీ కూడా ఇలాంటిదే. వీరిద్దరూ కలిసి నటించిన మొదటి సినిమా 'మిస్టర్' అట్టర్ ఫ్లాప్‌గా నిలిచింది. కానీ ఈ సినిమా సెట్స్‌లోనే వీరి మధ్య స్నేహం కాస్తా ప్రేమగా మారింది. ఇక దాదాపు నాలుగేళ్ల పాటు తమ ప్రేమను సీక్రెట్‌గా ఉంచిన ఈ జంట, ఆ తర్వాత ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అన్యోన్య దంపతులకు ఒక కొడుకు కూడా ఉన్నాడు.

**నారా రోహిత్ – సిరి లెల్లా:**
నటుడు నారా రోహిత్ కూడా తన సినిమా హీరోయిన్నే లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. రోహిత్, సిరి లెల్లా జంటగా 'ప్రతినిధి 2' అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా ఆడియన్స్‌ను పెద్దగా ఆకట్టుకోలేక ఫ్లాప్ లిస్ట్‌లో చేరింది. అయితే ఈ సినిమా పరిచయంతోనే ఒకటైన ఈ ఇద్దరూ, గతేడాది వివాహ బంధంతో అధికారికంగా తమ రియల్ లైఫ్ జర్నీని స్టార్ట్ చేశారు.

**వరుణ్ సందేశ్ – వితికా షేరు:**
ఇక వరుణ్ సందేశ్ 'కొత్త బంగారు లోకం' సినిమాతో ఒకప్పుడు యూత్‌లో ఓ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఆ తర్వాత వరుస ఫ్లాపులు పడుతున్న సమయంలో వితికాతో కలిసి 'పడ్డానండీ ప్రేమలో మరి' అనే సినిమాలో నటించాడు. ఇక ఈ సినిమా ఫ్లాప్ అయినా, వీరిద్దరూ మాత్రం నిజంగానే ఒకరి ప్రేమలో ఒకరు పడిపోయి పెళ్లి పీటలెక్కారు.

**రితేష్ దేశ్ ముఖ్ – జెనీలియా:**
తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న జెనీలియా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్ ముఖ్‌ను ప్రేమించి పెళ్లాడింది. వీరిద్దరూ కలిసి నటించిన 'తుజే మేరీ సనమ్' అనే హిందీ చిత్రం యావరేజ్‌గా ఆడింది. ఆ సినిమాతో మొదలైన వీరి బంధం పెళ్లి వరకు తీసుకెళ్లింది. ఇక ప్రస్తుతం ఈ జంట బాలీవుడ్‌లోనే మోస్ట్ హ్యాపియెస్ట్ కపుల్‌గా పేరు తెచ్చుకుంది. సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా, మనసు కలిస్తే జీవితం ఎంత అందంగా ఉంటుందో ఈ సెలబ్రిటీ జంటలను చూస్తే అర్థమవుతుంది. వెండితెరపై ఫ్లాప్ టాక్ తెచ్చుకున్నప్పటి కీ, నిజ జీవితంలో మాత్రం ఒకరికొకరు తోడుగా ఉంటూ వందకు వంద మార్కులతో సూపర్ హిట్ జంటలుగా దూసుకుపోతున్నారు.




అద్భుతమైన సంప్రదాయ రూపంతో అభిమానుల మనసు గెలుచుకున్న నాభా నటేష్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com